ఎల్‌వోసీ అందజేసిన హరీశ్‌రావు

ఎల్‌వోసీ అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 16: నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ గుండె చికిత్స కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అండగా నిలిచి రూ.2 లక్షల 50వేల ఎల్‌వోసీ అందజేశారు. సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన దేశెట్టి కళవ్వకు ఇటీవల హైదరాబాద్‌లోని నిమ్స్‌లో గుండె శస్త్రచికిత్స జరిగింది. మరిన్ని వైద్యఖర్చుల నిమిత్తం డబ్బులు అవసరం కాగా ఈ విషయమై హరీశ్‌రావును కలిశారు. ఆయన వెంటనే స్పందించి సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల 50 వేల ఎల్‌వోసీ మంజూరు చేయించి వారికి పత్రాన్ని అందజేశారు.

సార్.. మళ్లీ కేసీఆరే రావాలే

సార్.. మళ్లీ కేసీఆర్ వస్తేనే మంచిగుంటది. గీయన(రేవంత్‌రెడ్డి) వచ్చినకానుంచి ఏం మంచిగ అనిపిస్తలేదు. గాయనిచ్చిన(కేసీఆర్) రెండు వేల పింఛనే ఇస్తుండు. కొత్తగా ఏం పెంచి ఇయ్యలే. పంట రుణమాఫీ కూడా చేస్తలేడు. బతుకమ్మ పండుగొస్తే చీరె కూడా ఇయ్యలేదు. కేసీఆర్ సార్ వస్తేనే అందరికీ మంచి జరుగుతదని ధూళిమిట్ట మండలం తోర్నాల గ్రామానికి చెందిన పలువురు మహిళలు, వృద్ధులు బుధవారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి తమ ఆవేదన వ్యక్తం చేశారు.

– మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 16

సమాజ సేవచేయాలి

సురేందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఏప్రిల్ 16: ఉద్యోగులు విరమణ పొందిన తర్వాత శేషజీవితంలో ఖాళీగా ఉండకుండా సమాజ సేవ చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కోరారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె జడ్పీ పాఠశాల సాంఘికశాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు సురేందర్‌గౌడ్ ఉద్యోగ విరమణ పొందాడు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై సురేందర్‌గౌడ్‌కు శాలువా కప్పి సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంఈవో అంజాగౌడ్, మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు రాజేశ్వర్, రంజిత్, చంద్రం పాల్గొన్నారు.

క్యాన్సర్ అంటే భయం వద్దు

కరపత్రిక ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సిద్దిపేట, ఏప్రిల్ 16: క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం ద్వారా సరైన చికిత్స అందించి పూర్తిగా నయం చేయవచ్చని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రాజనర్సు అన్నారు. బుధవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కిమ్స్ దవాఖాన అంకాలజిస్ట్ వైద్యులు డాక్టర్ మధు, డాక్టర్ శ్రవణ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, పాల సాయిరామ్‌తో కలిసి కరపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారంతో కిమ్స్ దవాఖాన ఆధ్వర్యంలో ఈనెల 19న సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాలరంగం, మేర సత్తయ్య, మెర్గు మహేశ్, ఇర్షాద్ హుస్సేన్, పొన్నమల్ల రాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

గాగిళ్లాపూర్‌లో వాల్‌పోస్టర్లను అతికిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొమురవెల్లిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్16: వరంగల్ జిల్లాలో ఈ నెల 27న తలపెట్టిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని ఆపార్టీ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ కోరారు. బుధవారం మద్దూరు మండలం గాగిళ్లాపూర్‌లో రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను బీఆర్‌ఎస్ నాయకులు గోడలకు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ప్రజలు బలంగా నమ్ముతున్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొల్లు కృష్ణవేణీచంద్రమౌళి, పీఏసీఎస్ డైరెక్టర్ మేక మల్లేశం, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు చెవిటి మహేశ్, నాయకులు మేక ఉమామహేశ్వర్, పుప్పాల బాలస్వామి, ఇట్టమౌన కనకయ్య, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

భారీగా తరలిరావాలి

కొమురవెల్లి, ఏప్రిల్ 16: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని ఆపార్టీ మండలాధ్యక్షుడు గీస భిక్షపతి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు కొమురవెల్లిలో ఆయా గ్రామాల నాయకులతో కలిసి ఆయన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, మాజీ వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు బచ్చల సాయిమల్లు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తలారి కిషన్, ముత్యం నర్సింహులు, మాజీ ఉపసర్పంచ్ కొండ శ్రీధర్, సిలివేరు కనకమల్లేశం, గొల్లపల్లి నాగరాజు, గజ్జె వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చేర్యాల, ఏప్రిల్ 16: ఆశ, భయం అనే పేరుతో సైబర్ నేరస్తులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని సీఐ శ్రీను సూచించారు. మండలంలోని పోతిరెడ్డిపల్లిలో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం జరిగింది. సీఐ శ్రీను, ఎస్సై నిరేష్ మాట్లాడుతూ మానవ తప్పిదం వల్ల సైబర్ నేరాలు జరుగుతున్నాయని, బ్యాంకు అధికారుల పేరిట ఫోన్ చేసేవారిని నమ్మవద్దన్నారు.క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. సిద్దిపేట పోలీసు కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు శ్యామ్, ప్రసాద్, కనకయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

అతిపెద్ద జైన విగ్రహాన్ని కాపాడుకోవాలి

- పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

హైదరాబాద్ , ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): సిద్దిపేట జిల్లా నంగనూరులో ఉన్న 1100 సంవత్సరాలనాటి అతిపెద్ద జైన విగ్రహాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.ఈ వర్ధమాన మహావీరుడి విగ్రహం రెండు తెలుగు రాష్ట్రాల్లోకెల్లా అతి పెద్దదని ఆయన పేర్కొన్నారు. బుధవారం విగ్రహాన్ని పరిశీలించిన అనంతరం శివనాగిరెడ్డి మాట్లాడుతూ.. ఈ విగ్రహం తొమ్మిది అడుగుల ఎత్తు, మూడున్నర అడుగుల వెడల్పుతో ఉన్న విగ్రహమని, ఇది సుమారు తొమ్మిదో శతాబ్ధంలో రాష్ట్రకూటుల కాలపుది అయి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విగ్రహం చుట్టు ఉన్న రాళ్లను తొలిగిస్తున్నారని, దీనివల్ల విగ్రహానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని, అందుకే ప్రభుత్వం వెంటనే స్పందించి దీన్ని కాపాడేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా శివనాగిరెడ్డి వెంట కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, సభ్యులు అహోబిలం కరుణాకర్, సామలేటి మహేశ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వంతో కొట్లాడి నిధులు తీసుకువస్తా

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జాలపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

లింగాపూర్‌లో మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 16: ప్రభుత్వంతో కొట్లాడైన నిధులు తీసుకువచ్చి జనగామ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ధూళిమిట్ట మండలం జాలపల్లి, తోర్నాలలో ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయంగా రావాల్సిన వాటా ప్రకారం ప్రభుత్వం నిధులు కేటాయించాలని, ఒకవేళ నిధులు రాకపోతే సంబంధిత మంత్రుల దగ్గరకు వెళ్లి అడుగుతానన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గ సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించినట్లు తెలిపారు. కూటిగల్ చెరువును గోదావరి జలాలతో నింపనున్నట్లు తెలిపారు. నీలిమా దవాఖాన ద్వారా నెలకు 5వేల మందికి ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం పంట రుణమాఫీ చేయలేదని, దీనిపై తాను అసెంబ్లీలో ప్రభుత్వానికి సవాల్ విసిరినట్లు తెలిపారు. తెలంగాణలోని ఏ గ్రామంలోనైనా వందశాతం పంటరుణ మాఫీ చేసినట్లు నిరూపిస్తే ముక్కునేలకు రాసి రాజీనామా చేస్తానన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు సేవలందిస్తానని హామీ ఇచ్చారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ధూళిమిట్ట మండలం లింగాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు తాటికొండ శేఖర్‌రెడ్డి అమ్మమ్మ మేదిని వెంకటవ్వ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. జాలపల్లిలో బీఆర్‌ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు నాగులపల్లి సంపత్ తండ్రి రామయ్య ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు ముస్తఫా నాన్నమ్మ చాంద్‌బీ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శిచారు. కార్యక్రమాలలో మాజీ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, ధూళిమిట్ట, మద్దూరు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు మంద యాదగిరి, మేక సంతోష్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షురాలు చొప్పరి వరలక్ష్మీసాగర్, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు ఆకుల యాదగిరి, గ్రామ మాజీ సర్పంచ్‌లు ముక్క కనకయ్య, తాళ్లపల్లి రాజమ్మ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, తాళ్లపల్లి భిక్షపతి, నాచగోని వెంకట్‌గౌడ్, శివగారి అంజయ్య, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షులు గోనెపల్లి మల్లేశం, నాగులపల్లి కుమార్, సరిగొండ రాంరెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తిచేయాలి

లబ్ధిదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

గజ్వేల్, ఏప్రిల్ 16: ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ లబ్ధిదారులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని గిరిపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరుతో పాటు లబ్ధిదారులతో ఆమె మాట్లాడారు. ఇండ్ల పురోగతిని అడిగా తెలుసుకున్నారు. ఇంటిని నిబంధనల మేరకు 400-600 స్క్వార్ ఫీట్స్‌లో నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఇసుక విషయాన్ని లబ్ధిదారులు చెప్పగా వెంటనే ఇసుక అందించేలా చూడాలని ఆర్డీవో చంద్రకళను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ దామోదర్‌రావు, ఎంపీడీవో ప్రవీణ్, డీఈ అజయ్, ఏఈ పాల్గొన్నారు.

యువకులు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి

మిరుదొడ్డి, ఏప్రిల్ 16: గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు ఎవరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మిరుదొడ్డి టౌన్‌లో నర్మాల ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించే శక్తి పాలడెయిరీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రోజయ్య, రాజేశం, ప్రవీణ్, ఐలయ్య, ఎలయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్‌లో..

జగదేవపూర్, ఏప్రిల్ 16: యువత స్వయం ఉపాధితో రాణించాలని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, యాదవరెడ్డి అన్నారు. బుధవారం మండలం కేంద్రంలో గ్రామానికి చెందిన అమృత రాములు ఏర్పాటు చేసిన చాయ్‌బంక్‌ను ప్రారంభించారు. బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు నాగరాజు, మాజీ ఎంపీటీసీ కవితాశ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు యాదవరెడ్డి, కరుణాకర్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎక్బాల్, అమరరాము, నర్సింహారెడ్డి, మునీర్, కనకయ్య, రాజు, దయాకర్‌రెడ్డి, మల్లేశం, మహేశ్, నిర్వాహకులు అరుణ్, గణేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం మానుకోవాలి

మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

దుబ్బాక, ఏప్రిల్ 16: కొందరు తమ స్వార్థ రాజకీయాల కోసం అంబేద్కర్‌కు ముడిపెడుతూ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటి చర్యలు సరైనవి కావని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. ఈనెల 13న దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో పాటు తాను, పలువురు దళిత సంఘాల నాయకులు హాజరయ్యామన్నారు. అక్కడ జరిగిన ఘటనలో తానే ప్రత్యేక్ష సాక్షి అని పేర్కొన్నారు. తనతో పాటు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, మరికొందరు ఉన్నారని వివరించారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తన చేతిలో జెండాను కింద పడేసి, అంబేద్కర్‌ను అవమానపర్చినట్లు కొందరు దుష్ప్రచారం చేయడం హేయనీయమన్నారు. తాను ఎమ్మెల్యే పక్కనే ఉన్నానని అంబేద్కర్‌ను ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అవమానపర్చే విధంగా ఎక్కడా ప్రవర్తించలేదని ఆయన స్పష్టం చేశారు.

చరిత్రలో నిలిచిపోనున్న రజతోత్సవ సభ

ముస్త్యాలలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పెడుతల ఎల్లారెడ్డి

వీరన్నపేటలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీపీ శివశంకర్ తదితరులు

- వివిధ గ్రామాల్లో విస్తృత ప్రచారం, వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

చేర్యాల, ఏప్రిల్ 16: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోనుందని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎలికట్టె శివశంకర్ అన్నారు. మండలంలోని ముస్త్యాల, వీరన్నపేట గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు రజతోత్సవ సభ విజయవంతం కోసం సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రజతోత్సవ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ నిర్వహించిన సభల రికార్డులను రజతోత్సవ సభ బ్రేక్ చేస్తుందన్నారు. గ్రామాల నుంచి స్వచ్ఛందంగా ప్రజలు తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్ పార్టీ పై ప్రజల్లో నమ్మకం పోయిందని, అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కనకయ్య, యూత్ మండల అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు కిరణ్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

రోజూ 20 మందికి క్యాటరాక్ట్ సర్జరీలు

సిద్దిపేట, ఏప్రిల్ 16: జిల్లా కేంద్రంలోని జనరల్ దవాఖానలో రోజూ 20 మందికి క్యాటరాక్ట్ సర్జరీలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ విమలాథామస్ తెలిపారు. బుధవారం జిల్లా ప్రభుత్వ జనరల్ దవాఖానలో జిల్లా సమన్వయ సమావేశం మెడికల్ కళాశాల డైరెక్టర్, జిల్లా వైద్యాధికారి పల్వాన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాటరాక్ట్ చికిత్స కోసం స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించాలని వైద్యులకు సూచించారు. ప్రైవేట్ దవాఖానల్లో డెలివరీలు అవసరం మేరకు తప్పా ఇష్టారీతిన చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కువ నార్మల్ డెలివరీలు అయ్యేందుకు ప్రోత్సహించాలన్నారు. ఇందుకు వైద్య సిబ్బంది, వైద్యులు, ఆశ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి పల్వాన్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి, పీవో డాక్టర్ ఆనంద్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు రేవతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

చేర్యాల, ఏప్రిల్ 16 : మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని చేర్యాల ఎస్సై నీరేశ్ అన్నారు. బుధవారం చేర్యాల పట్టణంలోని పెద్దమ్మ గడ్డ వద్ద బ్రీత్ ఎనలైజర్స్‌తో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన అన్ని ధృవీకరణ పత్రాలు అందుబాటులో ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. కారు నడిపే వారు సీటు బెల్ట్ తప్పక పెట్టుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మాట్లాడుతున్న గరిమాఅగర్వాల్

రాయపోల్, ఏప్రిల్ 16: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అన్నారు. బుధవారం రాయపోల్‌లోని రైతు వేదికలో పోషణ పక్షం వారోత్సవాల సందర్భంగా మండల స్థాయి అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టకాహారానికి సంబంధించిన స్టాళ్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, గర్భిణులు, బాలింతలు నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఐసీడీఎస్ సీడీపీవో సరిత, ఎంపీడీవో బాలయ్య, ఎంఈవో సత్యనారాయణరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అనురాధ, షబాన, వైద్యాధికారి డాక్టర్ బల్ల మహరాజ్, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్లు కిరణ్, రాము, ఎంపీవో చిలుముల శ్రీనివాస్, ఎస్సై రఘపతి, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు

దుబ్బాకలో

దుబ్బాక, ఏప్రిల్16: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-7లో పోషణ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో ఎల్లయ్య, ఎంఈవో ప్రభుదాస్, తిమ్మాపూర్, రామక్కపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు ఉదయ్‌కుమార్, ఆడిబా, వైద్య సిబ్బంది. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల నాయకులు

జగదేవపూర్, ఏప్రిల్ 16: కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందనే విషయాన్నే దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కార్యకర్తల సమావేశంలో చెప్పారని, దీనికి దుబ్బాకలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేయడం శోచనీయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పీర్లపల్లి మాజీ సర్పంచ్ యాదవరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు నాగరాజు, బీఆర్‌ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు కొత్తకవిత, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, మాజీ ఎంపీటీసీ యాదగిరి, నాయకులు కనకయ్య, నరేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదు

మాట్లాడుతున్న జీడిపల్లి రాంరెడ్డి, మండల నాయకులు

తొగుట, ఏప్రిల్ 16: దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. మండలం కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని, ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయడం లేదన్నారు. దుబ్బాకకు స్కిల్ యూనివర్సిటీ, సమీకృత హాస్టల్ మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారని గుర్తుచేశారు.మాజీ మండల అధ్యక్షుడు మాల్లారెడ్డి, సీనియర్ నాయకులు రమేశ్, సొసైటీ వైస్ చైర్మన్ యాదగిరి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కనకయ్య, మండల యూత్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, నాయకులు రాంరెడ్డి, శ్రీశైలం, నరేందర్‌గౌడ్, నరసింహులు, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, కనకయ్య, అనిల్, యాదగిరి, ఐలయ్య, కిరణ్‌రెడ్డి, సంతోష్, చెన్నారెడ్డి, ఆంజనేయులు, స్వామి, శ్రీనివాస్, బాలు, వెంకటయ్య, రమేశ్, మధుసూదన్ రెడ్డి, రాజశేఖర్, పరశురాములు, గణేశ్, అజాం, రాంబాబు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

పంతులుతండాలో వడగండ్లతో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం

అక్కన్నపేట, ఏప్రిల్ 16: అకాలవర్షాలు, వడగండ్లతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం అదుకుంటుందని బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. అక్కన్నపేట మండలం పంతులుతండాలో ఇటీవల కురిసిన వడగండ్లతో నష్టపోయిన పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10వేల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. నష్టపోయిన పంటల వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అయిలయ్య, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అంతర పంటల సాగు భేష్

ఆయిల్‌పామ్ గెలను పరిశీలిస్తున్న డాక్టర్ పొన్నుస్వామి

గజ్వేల్, ఏప్రిల్ 16: జిల్లాలోని రైతులు సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటల్లో అంతరపంటలు సాగు చేయడంపై డైరెక్టర్ ఆఫ్ ఆయిల్ సీడ్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ పొన్నుస్వామి సంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిధిలోని అక్కారం, బూరుగుపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటను సందర్శించి గెలలను పరిశీలించారు. ములుగులో ఆయిల్‌పామ్ నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2025-26 సంవత్సరానికి ఆరు లక్షల అరవై ఆరువేల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయని, ఇప్పటి వరకు 12,339ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేశారన్నారు. జిల్లాలోని మిరుదొడ్డి మండలం చెప్యాల, మర్కూక్ మండల కేంద్రాల్లో ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. జూన్ మొదటి వారంలో నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తుందన్నారు. అడిషనల్ డైరెక్టర్ సరోజినిదేవి, జిల్లా ఉద్యాన అధికారి సువర్ణ, ఉద్యాన అధికారులు రమేశ్, కౌసల్య, బాలాజీ, విజయకృష్ణ, భాస్కర్‌రెడ్డి, శంకర్, ప్రవీణ్‌రెడ్డి, సుబ్బారావు, సంతోష్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌సాగుతో అధిక ఆదాయం

కొమురవెల్లి, ఏప్రిల్ 16: ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని డాక్టర్ పొన్ను స్వామి రైతులకు సూచించారు.మండలంలోని గురువన్నపేటలో శ్రావణ్‌కుమార్‌రెడ్డికి సంబంధించిన ఆయిల్‌పామ్‌తోటను సందర్శించారు. ఉద్యానశాఖ అదనపు డైరెక్టర్ సరోజనిదేవి, జిల్లా ఉద్యానశాఖ అధికారి సువర్ణ, ఆయిల్‌ఫెడ్ జిల్లా ఇన్‌చార్జి భాస్కర్, మండల ఉద్యాన అధికారి కౌసల్య, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ సుబ్బరావు పాల్గొన్నారు.

పేదింటి వధువుకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 16: ధూళిమిట్ట మండలం జాలపల్లికి చెందిన నర్మెట సారయ్య ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లి ఇటీవల మృతి చెందాడు. సారయ్య కూతురు సరిత పెండ్లి ఈ నెల 23న జరగనుండడంతో సరిత కుటుంబ పరిస్థితిని గ్రామ మాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మీసాగర్ బుధవారం గ్రామ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి వధువు సరితకు రూ. 10వేల నగదు అందజేశారు.

నేడు సన్నాహక సమావేశం

జగదేవపూర్, ఏప్రిల్ 16: వరంగల్ జిల్లాలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయడానికి గురువారం మండల కేంద్రంలోని కేశిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

యోగాసనాలు పాటించాలి

వర్గల్, ఏప్రిల్ 16: సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతిఒక్కరూ యోగాసనాలు పాటించాలని మండలంలోని జెబ్బాపూర్ మహిళా సమాఖ్య సంఘం కోఆర్డినేటర్ నర్సింహులు కోరారు. బుధవారం మండలంలోని జెబ్బాపూర్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఆరోగ్యభద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పొదుపుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామ మహిళా గ్రూపు సభ్యులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

దుబ్బాక, ఏప్రిల్16: దుబ్బాక వందపడకల దవాఖానలో బుధవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. దవాఖానలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు జరిగితే మంటలు ఆర్పేందుకు తీసుకునే చర్యలను వైద్య సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో దుబ్బాక అగ్నిమాపక కేంద్రం అధికారి కరుణాకర్, సిబ్బంది లక్ష్మణ్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొమురవెల్లి, ఏప్రిల్ 16: మండల కేంద్రంలో ఈనెల 20న బీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే కంటి వైద్య శిబిరాన్ని మండలంలోని పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో కంటి వైద్య శిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బీఆర్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు ఆవిష్కరించారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పల్లె జీవితానికి జానపదం అద్దంపడుతుంది

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 16: పల్లె జీవితానికి జానపదం అద్దంపడుతుందని తెలంగాణ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ గుండె డప్పు కనకయ్య అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం 'జానపద సాహిత్యం పునర్మూల్యాంకనం' అనే అంశంపై అంతర్జాల జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత అధ్యాపకురాలు అండమ్మ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మెరగుపడటం మూలంగా జానపద సాహిత్యంతో పాటు జానపద పరికరాలు మరుగున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, అధ్యాపకులు విజయలక్ష్మి, లీలావతి, మహేశ్వరి, వెంకటరమణ, చక్రహరి, రమణ, సంపత్, రామస్వామి, నరేశ్, శైలజ, నర్సింహులు, సాయిసురేశ్ పాల్గొన్నారు

ట్రాక్టర్ బోల్తా.. యువకుడి మృతి

అక్కన్నపేట, ఏప్రిల్ 16: ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతిచెందిన ఘటన అక్కన్నపేట మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని పోతారం(జె)కు చెందిన లింగాల భాను(23) అనే యువకుడు బుధవారం తెల్లవారుజామున ఖాతాలో తన బావ వద్ద ఉన్న ట్రాక్టర్‌ను తీసుకువస్తుండగా పోతారం(జె) కల్వర్టు వద్ద అదుపుతప్పి బోల్తా పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి లింగాల యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయభాస్కర్ తెలిపారు.

హైనా దాడిలో జీవాలు మృతి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్16: హైనా దాడిలో జీవాలు మృతిచెందిన ఘటన మద్దూరు మండలం రేబర్తిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఈరి శ్రీనివాస్ తన వ్యవసాయ బావి వద్ద షెడ్డు నిర్మించి గొర్రెల పెంపకాన్ని చేపట్టాడు. రోజు మాదిరిగానే మంగళవారం గొర్రెలను మేతకు తీసుకెళ్లి రాత్రి షెడ్డులో తోలి ఇంటికి వచ్చాడు. బుధవారం తెల్లవారుజామున షెడ్డు వద్దకు వెళ్లి చూడగా హైనా దాడిలో ఏడు గొర్రెలు మృతి చెంది ఉండగా మరో మూడు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని బాధితుడు శ్రీనివాస్ వాపోయాడు.